# సమస్తముతో దేవుని ప్రేమించుట

## మార్కు 12:29, 30, పరిశీలన

మన ప్రస్తుతపు స్టడీ "అన్నిటి కంటె మహాగొప్ప ఆజ్ఞ" అనే దాని మీద.[1] "మహాగొప్ప ఆజ్ఞ ఏది?" అని నీవు అడుగవచ్చు. ఒకనాడు శాస్త్రి యొకడు ప్రభువును అదే ప్రశ్న అడిగాడు. క్రీస్తు యిలా చెప్పారు:

> – ప్రధానమైనది ఏదనగా – ఓ ఇశ్రాయేలూ, వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ (మార్కు 12:29, 30).

దేవుడనుగ్రహించిన వాటిలో ప్రధానమైన ఆజ్ఞ యిది. ఇది నా అభిప్రాయం కాదు, లేక పొరపాటు పడదగిన ఏ నరుని అభిప్రాయమూ కాదు. కాని ఇది దేవుని కుమారుని వివాదములేని ప్రతిపాదనయై యుంది.

ఒక క్షణం సేపు, నేడు అనేకులు అనుసరించే మతంతో ఈ లేఖనపు డిమాండ్లను పోల్చి చూడు. అనేకులకు, ప్రాథమికంగా మతం మనస్సాక్షికి ఉపశమనం కలిగించే, అంతస్థును నిర్మించేదిగా ఉంది. కొన్ని ప్రాంతాల్లోనైతే, సంఘం సభ్యత్వం పెరుగుతోంది – కాని నేరము యువకులు హద్దులు తప్పడం కూడా అలాగే అధికమౌతుంది. ఆ ప్రాంతాల్లో, నైతిక పరిస్థితులు పతనమౌతుండగా, సంఘ సభ్యత్వము అధికమౌతుంది. అనేకుల జీవితాల్లో, మతము, జీవిత నడవడిక వేరైయుంటుంది. కుడి చేతితో జరిగే వ్యవహారం ఎడమ చేతిలోని మతానికి తెలియకుండ కొందరు చేస్తుంటారు.[2] మార్కు 12:29, 30లో క్రీస్తు బోధించినదానికి యిది ఎంతో దూరం.

సమస్తముతో దేవుని ప్రేమించుమని శాస్త్రికి క్రీస్తు యిచ్చిన బదులు క్రైస్తవ్యానికి కీలకమైయున్నది:

- "నీ పూర్ణ హృదయముతో" – ఉద్వేగమునకు నిలయము.
- "నీ పూర్ణాత్మతో" – జీవమునకు నిలయము.
- "నీ పూర్ణమనస్సుతో" – వివేకమునకు నిలయము.
- "నీ పూర్ణబలముతో" – నీ శక్తికి నిలయము.[3]

దేవుని వ్యక్తిత్వానికి నీ సంపూర్ణ వ్యక్తిత్వముతో సేవచేయడం. వ్యక్తి యొక్క సంపూర్ణతను దేవుడు కోరుతున్నాడు లేకుంటే ఆయనకు ఏమీ అక్కరలేదు.

మనపై అలా డిమాండ్ చేసే హక్కు దేవునికి ఉందా? ఎవరైనా అడుగవచ్చు. ఆయన మనకు అనుగ్రహింపనిది ఏదియు దేవుడు మనయొద్దనుండి కోరడు. దేవుడు మనలను "సమస్తముతో" ప్రేమించాడు:

> దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3:16).

> అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను (రోమా. 5:8).

> దేవుడు ప్రేమాస్వరూపి; ప్రేమ లేనివాడు దేవుని ఎరుగడు. మనము ఆయన ద్వారా జీవించునట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను: దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్ష పరచబడెను. మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను: ఇందులో ప్రేమయున్నది (1 యోహాను 4:8–10).

దేవుడు మనకొరకు చేసినదంతయు క్రీస్తు సిలువ యందు బయలుపరచబడింది. మనం దాన్ని గూర్చి ఆలోచించినప్పుడు,

> ప్రేమ ఎంతో అద్భుతమైనది, ఎంతో దైవికమైనది,
> నా ప్రాణాన్ని, నా జీవితాన్ని, నా సమస్తాన్ని డిమాండ్ చేస్తుంది.[4]

అని అన్న కవితో మనం ఏకీభవించవలసి వస్తుంది.

## మన పూర్ణ మనస్సుతో దేవుని ప్రేమించుట

"సమస్తముతో దేవుని ప్రేమించడానికి" మనలో ప్రతి ఒక్కరికి సహాయపడేలా, ప్రధానమైన ఆజ్ఞలోని ఆయా సంగతులను ఆలోచన చేద్దాం. మొదట మనస్సుతో ప్రారంభించుదాం: "నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణమనస్సుతో ... ప్రేమించాలి." మనస్సు వివేకానికి సంబంధించినది, యిది వ్యక్తిలో ఆలోచించే భాగం. జనులు మనస్సుతో ఆదాయపు పన్నును గురించి యోచిస్తారు.[5] జనులు ముఖ్యమైన అవిష్కరణలను చేస్తారు. పిల్లలను మనం బడికి పంపినప్పుడు, అక్కడ తర్ఫీతు పొందేది ప్రాథమికంగా వారి మనస్సే. మనిషిలోని ఈ భాగం అంకితం కావాలని దేవుడు కోరుకుంటాడు.

మన పూర్ణ మనస్సుతో పలువిధాలుగా మనం దేవుని ప్రేమించవచ్చు. ఒక విధానమేమంటే – శ్రద్ధగా ఆయన వాక్యమును పఠించుట. మాసిదోనియలో పౌలు సువార్త సంచారములను గూర్చి వ్రాసినప్పుడు, లూకా ఈ విషయాన్ని గుర్తించాడు: "వీరు థెస్సలొనీకలో ఉన్నవారికంటె ఘనులైయుండిరి కనుక ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును సీలయును చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతి

దినమును లేఖనములు పరిశోధించుచువచ్చిరి" (అపో. 17:11). పెద్దల యోగ్యతలను గూర్చి పౌలు తీతుకు రాసినప్పుడు, "తాను హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకు, ఎదురాడువారి మాట ఖండించుటకును శక్తికలుగునట్లు, ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొనువాడై యుండవలెను" అని తెలియజేశాడు (తీతు. 1:9). తన పూర్ణమనస్సుతో దేవుని ప్రేమించువాడు ప్రతిదినము కొంత సేపు గ్రంథాన్ని చదవాలి. తాను దేవుని చిత్తమును తెలుసు కొనగలిగినట్లు ప్రభువు సంఘ కూడికలకు హాజరౌతూ ఉండాలి.

పైగా – యిది అతిముఖ్యమైనది – తమ యింటిలో కుటుంబంగా గ్రంథం కలిసి చదవడం, ప్రార్థించడం అనే సంగతులు జరగాలి. ఆత్మసంబంధమైన ఈ కార్యాలకు, ధ్యానానికి సమాయాన్ని ప్రతి కుటుంబం కేటాయించినప్పుడు, లోకం ఎంతగా దీవించబడుతుందో! నేరం మీద ప్రసిద్ధిగాంచిన వ్యక్తి నేరము, దానిని అరికట్టడం[6] అనే సంగతులను గూర్చి యిలా రాశాడు:

> కుటుంబ పరిధిలలో యింతకు ముందుకంటెను యిప్పుడు పరిశుద్ధగ్రంథము ఎక్కువ ప్రాముఖ్యమైయుంది. అది కుటుంబాన్ని సన్నిహితంగా కలిపి అతికించేదైయుంది. ప్రతి సభ్యునికి జీవించవలసిన విశ్వాసాన్ని అది అందిస్తుంది.
>
> – చిన్న బాలునిగా, నేను మా తల్లి మోకాళ్ల వద్ద కూర్చుండగా, ఆమె బైబిలు చదువుతున్నప్పుడు, దాని భావాన్ని వివరించి, కథలను చెప్తూతూ ఉండేది. మా మధ్య విశ్వాసము బహు బలీయంగా కట్టడానికి అది ఎంతో పని చేసింది. అప్పుడు, మా తండ్రి కుటుంబాన్ని ఏకంగా కూడ్చి బైబిలు వచనాలు చదివే అద్భుతమైన రాత్రులు కూడా ఉండేయి. కుటుంబ చర్చలలోనికి అవి మమ్మును నడిపించేవి. అవి ఆసక్తికరంగాను, సజీవంగాను, విషయాన్ని అందించేదిగాను ఉండేవి. నా జీవితమంతటిలో శోధనకరమైన క్షణాల్లో అద్భుతమైన ఆ సమయాలు విశ్వాసపు శక్తి, ప్రార్థనా శక్తి కలిగేలా శాశ్వతమైన ముద్రలు మనస్సులో నిలిచాయి.

జ్ఞానయుక్తంగా ప్లాను వేసి, సరియైన నిర్ణయాలు చేసికొన్నప్పుడు, మన పూర్ణ మనస్సుతో మనం దేవుని ప్రేమించువారమై యుంటాం. ఇక్కడ రెండు యుక్తమైన లేఖన భాగాలున్నాయి: "దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసీ. 5:15, 16), "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి ..." (మత్తయి 6:33ఎ). దేవుని ప్రేమించువాడు ముఖ్య విషయాలకు తన ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తాడు–భక్తి కలిగియుండడానికి, యితరులకు సహాయం చేయడానికి, ప్రభువు కొరకు పనిచేయడానికి ఉపయోగిస్తాడు. నాకు "మేలైనదేది?" అనుకోకుండా, "దేవుని సంకల్పానికి ఏర్పాట్లలో ఏది ఉత్తమమైనది" అనేవాటిని తీర్మానించే సూక్ష్మమైన సాధనముగా అతని మనస్సు పని చేస్తుంది.

తమ పూర్ణమనస్సుతో ప్రేమించే ప్రత్యేకమైన మార్గం – ప్రభువు పనిలో తమ సంపూర్ణ సమయాన్ని సమర్పించడం, "నీకు అసాధారణమైన మనస్సుంది. నీవు డాక్టరువో, సైయింటిస్టువో లేక లాయరువో అయ్యుండాలి" అని కొన్ని సార్లు యువకులను గూర్చి కామెంట్స్ వింటూ ఉంటాం. క్రైస్తవ డాక్టర్లు, క్రైస్తవ లాయర్లు, క్రైస్తవ వ్యాపారులు,

క్రైస్తవులు యింకా యితర ప్రొఫెషన్‌లో ఉండాలన్న మాట వాస్తవమే గాని, అంతకంటెను ప్రసంగవేదికలవద్ద, క్లాసు రూముల్లో లేఖనాలను విప్పి నమ్మదగిన బోధ చేయగల మనుష్యులు ఎక్కువగా కావలసియుంది. ప్రసంగించడానికి ఉపదేశించడానికిని మన మధ్య అతిశ్రేష్ఠమైన మనస్సులు అవసరమైయున్నాయి.

పూర్ణ మనస్సుతో దేవుని ప్రేమించుటను గూర్చి ఆలోచించినప్పుడు, కొంచెంసేపు ఆగి, ఒక హెచ్చరికను వినిపించనిమ్ము: ఇది కేవలం ఆజ్ఞలో నాల్గవ భాగం మట్టుకే సుమీ! కేవలం మనస్సును మాత్రమే నొక్కిచెప్పితే, వెర్రి, అర్థరహితమైన మతం ప్రతిఫలింపవచ్చు. ఎంతమంది దేవదూతలు ఒక గుండు సూది మీద హాయిగా కూర్చోగలరు అంటూ అర్థం లేని వాదాలతో కాలం గడిపేలాటి అపాయం వివేకాన్ని అతిగా నొక్కి చెప్పడంలో ఉంటుంది. అందువలన, దేవునికి వివేకంలో శ్రేష్ఠమైన దానిని సమర్పించుదాం. అయినా, ఆజ్ఞలో ఈ భాగము ఒంటరిగా నిలువనేరదు. దేవునికి నరుడు సంపూర్ణంగా సమర్పించబడాలనే రూపంలో ప్రభువు ఒక రూపాన్ని చిత్రించారు.

## పూర్ణ హృదయముతో దేవుని ప్రేమించుట

తరువాత మనం ఆజ్ఞలో ఈ భాగాన్ని గూర్చి ఆలోచింపవలసి యుంటుంది: "నీ దేవుడైన ప్రభువును ... నీ పూర్ణహృదయముతో ... ప్రేమింపవలెను." బైబిల్లో "హృదయము" అనే పదం అనేక విధాలుగా ప్రయోగింపబడింది. అది మనుష్యుని వివేచనకు లేక వాని చిత్తానికి సూచనగా ఉండవచ్చు. ఏదియెలాగున్నా, ఈ సందర్భంలో, మానవ ఉద్వేగానికి నిలయంగా ఉపయోగించబడింది, వాని ఫీలింగ్స్‌కు కేంద్రంగా.

భక్తిలో ఉద్వేగం యొక్క ప్రాముఖ్యతను కొన్ని సార్లు మనం తక్కువగా అంచనా వేస్తాం. అనేక మతాలలో నేడున్న ఉద్వేగపు ధోరణికి మనం ప్రతిచర్య కనుపరుస్తాం. ఉద్వేగపు సాధనాన్ని మనం మితిమించి నొక్కి పలుక నుద్దేశించకపోయినా ఉద్వేగాలు: (emotions) లేకుండా ఎవరే కదిలింపబడరు. (emotion) ఉద్వేగం, (motive) చలింపజేసెడి, (motor) చాలిన శక్తి అనే పదాలకు మధ్యగల సంబంధాన్ని గూర్చి ఆలోచించు. కారులో ఉన్న మోటార్ దాన్ని పోయేలా చేస్తుంది. జీవితంలోని మోటివ్ కూడా అదే పనిచేస్తుంది. ఆ మోటీవ్ (ఉద్దేశం) వెనుక ఎమోషన్ (ఉద్వేగం) ఉంది.

"ఉత్సాహం" అనే పదంలో తీక్షణమైన మనోభావముంటుంది. "దేవుని యందు" లేక "దేవుడు మనలో" అని అర్థమిచ్చే గ్రీకు పదం నుండి అది వచ్చింది. మనం దేవుని యందును, "దేవుడు మనయందును ఉన్నట్టయితే" (1 యోహాను 4:16), మనం ఉత్సాహభరితులం, తీక్షణమైన మనోభావముగలవారమై యుండాలి. డేవిడ్ లిప్స్‌కోంబును[7] ఎరిగినవారు, తాను ఏడ్చినట్టు ఒక్కసారే చూచారట. ఒక ప్రభువు దినాన ప్రభువుబల్ల నడిపించేటప్పుడు అది సంభవించిందట, ప్రభురాత్రి భోజనపు ప్రాముఖ్యతను గూర్చి కొద్దిగా మాట్లాడినప్పుడు, ఆ మాటల మధ్యలో అతడు ఏడ్చి, మాటలు ముగించలేక పోయాడట. సహో. లిప్స్‌కోంబ్[7] తన కన్నీళ్లు మనస్సుతో కాదు, హృదయంతోనే కార్చాడు.

చాలాకాలం క్రిందట రాజైన దావీదు పాతనిబంధనలో బహు శక్తివంతమైన భాగాలను రాశాడు. తాను రాసిన కీర్తనలను నేటికిని మనం చదువుతూ ప్రేమిస్తుంటాం. మనపై

వాటి ప్రభావము అంతగా ఉండడానికి ప్రధాన కారణం, దావీదు వాటిని తన హృదయంలో నుండి రాశాడు. “తన సొంత భావోద్రేకముల అడుగు నుండి ద్రవీభవించిన అగ్నిగా అతడు లేఖన భాగాలను కుమ్మరించాడు, మన హృదయములలో అవి యింకను నిప్పురాజుబెట్టుతున్నాయి.”[8]

మన పూర్ణహృదయముతో దేవుని ప్రేమించడమంటే ఏమి? ఈ క్రింది కార్యములు జరిగినప్పుడు మన పూర్ణహృదయములతో దేవుని ప్రేమించువారమై యుంటాం ...

- దేవునికి లోబడాలనే ఒత్తిడితో కాదు, దేవునికి మనం లోబడాలనే కోర్కెతో విధేయులమైనప్పుడు.
- దేవునితో సమానంగాను, ఆయనతో ఉన్న బాంధవ్యంలో తప్ప మరి దేనిని మనం ప్రేమించనప్పుడు.
- మిగిలినవాటన్నిటి కంటె అధికంగా దేవుని ప్రేమించినప్పుడు.

పైగా, ఆయనను యుక్తముగా సేవించుటకు, అవసరమైతే, దేనినైనా వదులుకొనడానికి మనం యిష్టపడినప్పుడు, మన పూర్ణహృదయముతో దేవుని ప్రేమించినవారమై యుంటాం. ఈ క్రింది వాటిని వదులుకొనడానికి మనం యిష్టపడి యుండాలి ...

- అబ్రాహాామువలె తన ప్రియులను విడిచిపెట్టవలసినప్పుడు.
- యోబువలె సొత్తును పోగోట్టుకొనవలసి వచ్చినప్పుడు.
- మోషేవలె భోగములను విడిచిపెట్టవలసి వచ్చినప్పుడు.

మరల, ఆయన కొరకు మనం దేనినైనా చేయడానికి యిష్టపడినప్పుడు, దేవుని హృదయ పూర్వకంగా మనం ప్రేమించినవారమౌతాం:

- దావీదు వలె మారుమనస్సు పొంద నిష్టపడినప్పుడు.
- పెంతెకొస్తు దినమున యూదులవలె బాప్తిస్మపొందవలసినప్పుడు.
- పౌలువలె దేహములను నలుగగొట్టు కొన్నప్పుడు.
- దొర్కావలె పరిచర్యచేయ నిష్టపడినప్పుడు.
- జక్కయ్యవలె యిచ్చినప్పుడు.

సంఘానికి ఎక్కువగా మనోభావము ఎక్కువ హృదయంతో కూడిన పరిచర్య అవసరం. ఏదియెలాగున్నా, మరోసారి, హెచ్చరిక వినిపించబడవలసియుంది. భక్తిలో నుండి మనోభావాలు, ఉద్వేగాలు తప్ప తక్కిన దానినంతటిని కొందరు బయటికి నెట్టేశారు. మనోభావాల మీదనే ఆనుకున్నవారు మన్ను లోతుగా లేని రాతినేలను విత్తబడినట్టున్నారు. మన్ను లోతుగా లేనందున మొలకులు వెంటనే మొలచినా, త్వరలోనే ఎండిపోతాయి (మత్తయి 13:6). ఏదైనా వారిని లోతుగా కదిలించినట్టయితే, బలీయమైన మనోభావాలు

వారికి ఉన్నంత మట్టుకు, దేవునికి అది అంగీకారమైయుండాలని అనేకులు నమ్ముతారు. అది నిజం కాదు. మతశాఖల ప్రపంచం తరచుగా ఉద్వేగాలలో తీవ్రతను కనుపరచుతూ – దేవుని ఆజ్ఞలు గైకొననవసరం లేదనుకుంటారు (రోమా. 10:2 చూడు).

అన్నిటికంటె ప్రధానమైన ఆజ్ఞలో, వివేకము (మనస్సు), హృదయము, ఉద్వేగము, వివేచన కలిసియుండాలని ప్రభువు గుప్తం చేశారు. ఉద్వేగాన్ని కారులోని మోటర్‌తో పోల్చాం. అయితే వివేకము కారులోని స్టీరింగ్‌తో పోల్చుదాం. కారు ఉద్దేశింపబడిన గమ్యాన్ని చేరడానికి ఈ రెండూ అవసరమే. మోటారు, స్టీరింగు కలసి ముందుగా బహు దూరానికి ఒకని తీసికొని పోవచ్చు, అయితే అది ఎక్కడ అంతమౌతుందనేది ఎవరికి తెలుసు? మరోవైపు, స్టీరింగ్ చక్రమున్నా మోటరు లేకుంటే అది ఎక్కడికి వెళ్లలేదు. కారుకు రెండును అవసరమే. ఆ ప్రకారమే దేవుడు కోరిన భక్తి కావాలంటే మనకు మనస్సు హృదయము రెండును అవసరమే. తండ్రియొక్క చిత్తాన్ని మనస్సు నేర్చుకొని, ఆయనచే నియమింపబడిన హద్దుల్లో అది మనలను ఉంచుతుంది. అప్పుడు హృదయము మన మనోభావాలకు వెట్ట కలిగించి ఉద్రిక్తంచేసి దేవుని పరిధులలో, మహోన్నతుని సేవించి ఆరాధించేలా చేస్తుంది. పూర్ణవివేకము (మనస్సుతో), పూర్ణహృదయముతో మనము దేవుని ప్రేమింప ప్రయాసపడుదాం.

## పూర్ణబలముతో దేవుని ప్రేమించుట

“నీ దేవుడైన ప్రభువును నీ ... పూర్ణబలముతో ప్రేమించు”మని యేసు చెప్పారు. ఒక వ్యక్తియొక్క బలము అతని తలాంతులతోను శక్తితోను కూడినదైయుంటుంది. ఇంతవరకు, దేవుని పూర్ణమనస్సు (వివేకమునకు కేంద్రమైనది)తోను, పూర్ణహృదయ ముతోను (ఉద్వేగములకు కేంద్రమైనదాని) తోను ప్రేమించాలని చర్చించుకున్నాం. కాని ఈ రెండును వ్యక్తి లోపల ఉండేవే. మనం దేవుని నిజంగా ప్రేమించినట్లయితే, ఆ ప్రేమ వ్యక్తపరచబడుతుంది: కార్యములోను, విధేయతలోను వ్యక్తపరచబడుతుంది.

క్రైస్తవ్యము క్రియారూపమైన భక్తిగలది. “ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును” (మత్తయి 7:21). “మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి” అని యాకోబు రాశాడు (యాకోబు 1:22). “ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించినవాటి ఫలము ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును” అని పౌలు అన్నాడు ( 2 కొరింథీ. 5:10). తన బలమును దేవుని సేవకు వినియోగింప నిష్టపడనివాడు పరలోక రాజ్యమునకు పాత్రుడు కాడు.

మన బలముతో దేవుని మనమెట్లు ప్రేమింతుము? మనకు కలిగియున్న దానిని ఆయన కొరకు మనము ఉపయోగించినట్లయిన మన బలముతో దేవుని ప్రేమించువారమై యుంటాము. సామర్థ్యము + అవకాశము = బాధ్యతయైయుంటుంది. దేవుని సేవలో నీ తలాంతులను నీ శక్తులను ఎంత ప్రయోజనకరంగా ఉపయోగింపగలవో తీర్మానించుకో.

మనకున్న సామర్థ్యంలో మనం ఉపయోగించుకోగలిగే దానికంటే పదిరెట్లు ఎక్కువగా ఉంటుందని చెప్పుతారు. క్రీస్తు కొరకు నీ తలాంతులను నీకు చేతనైనంతవరకు వృద్ధిచేసికో.

పైగా, యింతకు ముందే చెప్పినట్టు, మన హృదయంలో ఉన్న ప్రేమ నిదర్శనమైన క్రియారూపంగా వ్యక్తపరచవచ్చినప్పుడు మన పూర్ణబలముతో దేవుని ప్రేమించువారమై యుంటాం. దీన్ని తేటగా చెప్పాలంటే, మనం ప్రభువు కొరకు పనిచేయాలి (1 కొరింథీ. 15:58). తన పనిని తగ్గించాలని డాక్టరు ఒక భక్తునికి సలహాయిచ్చాడట. అందుకు "నేను మృతిపొందిన అయిదు నిమిషాల తరువాత నేను విశ్రమించుతా"నని ఆ భక్తుడు బదులిచ్చాడట. గత తరములో గుర్తింపు పొందిన ఒక సువార్తికుడు, ముసలివాడు కావాలని ఉద్దేశించలేదట, క్రీస్తు సేవలో అరిగిపోవాలని కోరుకున్నాడట. నన్ను అపార్థం చేసికోవద్దు. మనకందరికి అప్పుడప్పుడు విశ్రాంతి కావాలి (మార్కు 6:31). నేను చెప్పేదేమంటే, తుప్పుపట్టేదానికంటె అరిగిపోవడం శ్రేష్ఠమని.

చివరిగా, మన శ్రేష్ఠమైనవి సమర్పించునప్పుడు, మన పూర్ణశక్తితో దేవుని ప్రేమించువారమై యుంటాం. మా కుటుంబం ఒక ముసలి కుక్కను ఎలా ట్రీట్ చేస్తూ ఉండేదో, ఆలాగే తరచుగా మనం దేవుని ట్రీట్ చేస్తూ ఉంటాం; మేము దానికి మిగిలిపోయిన వాటిని యిస్తూ ఉండేవారం. మన జీవనాన్ని సంపాదించుకొనడానికి, యింకా తక్కిన కార్యకలాపాలకు ఉపయోగించుకొనగా మిగిలిన సమయం, ధనం, తలాంతులు, బలం దేవునికి అవసరం లేదు. మనలోని శ్రేష్ఠమైన దాన్ని ఆయన కోరుతున్నాడు (మత్తయి 6:33). మన పూర్ణబలముతో ఆయనను ప్రేమించినవారమైతే, మన శ్రేష్ఠమైన వాటిని ఆయనకు సమర్పిస్తాం.

ఆయన కొరకైన మొత్తం స్పందనలో మన పూర్ణబలము ఒక భాగమై యుంది. సమ్సోను తన బలముతో దేవుని ప్రేమించాడు, కాని తన మనస్సు (వివేకం)తోను హృదయంతోను ఆయనను ప్రేమించలేక పోయాడు. మన బలముతో వ్యక్తపరచబడే ప్రేమ వివేకముతో నడిపింపబడినదై మనోభావాలవలన ఉద్దేశం కలిగింపబడవలసినదై యుంటుంది. ఏదియెలాగున్నా, క్రీస్తు కొరకు పనిచేయడం మన ప్రేమయొక్క నిర్మలత్వాన్ని సూచిస్తుంది.

## మన పూర్ణాత్మతో దేవుని ప్రేమించుట

నీ దేవుడైన ప్రభువును "నీ పూర్ణాత్మతో" ప్రేమించాలని ప్రభువు చెప్పిన సంగతిని చివరిగా గుర్తించుదాం. క్రీస్తువారి జాబితాలో పూర్ణాత్మ అనేది రెండవది. నేను దాన్ని చివరికి మిగిల్చాను ఎందుకంటె తండ్రికి మనమిచ్చే జవాబుకు సంగ్రహంగా అది పని చేస్తుంది.

"ఆత్మ" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం psuche, ఇది psyche[9] అని కూడా వ్రాయబడుతుంది. ఈ పదంలోనుండే "psychology" వచ్చింది. కొన్ని సార్లు క్రొత్త నిబంధనలో ఈ పదం "మనస్సు" లేక "హృదయం" అనే వాటికి సమాంతరంగా ఉపయోగించబడింది. ఆలోచనా లేక మనిషిలోని ఫీలింగ్ భాగంగా కూడా ఉపయోగించబడింది. మనలో ఎక్కువ మంది "ఆత్మ" అనేది మనిషిలోని నిత్యత్వపు

భాగము. ఏదియెలాగున్నా, మార్కు12:29, 30లో వివేకము మనస్సు అనేవాటితో తారతమ్యాన్ని చూపి వాటితో సమాంతరంగా సూచింపబడింది. ఇంతవరకు యివ్వబడిన రెండు నిర్వచనాలు తగినవిగా కన్పించలేదు.[10] psyche అనేది తరచుగా "ప్రాణము" అని తర్జుమా చేయబడుతుంది. ఈ క్రింది లేఖన భాగాలను గమనించు. వాటిలో "ప్రాణము" అనే ప్రతిమాట psuche అనే దాని నుండి తర్జుమా చేయబడింది:

> అందువలన ... ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారము కంటె ప్రాణమును, వస్త్రముకంటె దేహమును గొప్పవి కావా? (మత్తయి 6:25).
>
> తన స్నేహితులకొరకు తన ప్రాణమును పెట్టుటకంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు (యోహాను 15:13).
>
> మీలో ఎవడు ముఖ్యుడై యుండ గోరునో వాడు మీ దాసుడైయుండవలెను. ఆలాగే మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను (మత్తయి 20:27, 28).

ఈ లేఖన భాగంలో, psyche అనేది మనిషిలో ఉన్న ప్రాణాన్ని సూచించింది. "తన ప్రాణమంతటితో దేవుని ప్రేమించడమంటే," తన వ్యక్తిత్వమంతటితో ఆయనను ప్రేమించడం – ఒకనికి కలిగిన సమస్తముతో, ఒకడు ఏమైయున్నాడో దానంతటితో, ఒకడు ఏమి కాగలడో దానంతటితో ఆయనను ప్రేమించాలి.

ఆ లైన్లో మనం నిలబడితే, మన జీవితాలతో – భూసంబంధమైన మన జీవితాలకును, భౌతికమైన వస్తు వాహనాలకును ముందు దేవుని ఉంచవలసి యుంది. అవసరమైతే – మన జీవితాలను త్యాగం చేయవలసి యుంటుంది – ఆయన యొక్కయు మానవాళి యొక్కయు సేవలో మన జీవితాలను ఉపయోగించడానికి యిష్టపడవలసి యుంటుంది. మన ప్రాణమంతటితో దేవుని ప్రేమించడానికి – హృదయము, శరీరము, ప్రాణము సంపూర్ణంగా మనలను మనమే సమర్పించుకొనవలసియుంటుంది. "మనస్సు, కండరం, డబ్బు, సమయం, నాలుక, తలాంతు; తల(బుర్ర), చెయ్యి మరియు హృదయము; శరీరము, ప్రాణము, ఆత్మ – సమస్తమును మన ప్రభువునకు సమర్పించబడవలసిన అవసరముంది"[11] అని T. B. Larimore అనే గొప్ప ప్రీచర్ అన్నాడు.

## ముగింపు

మనిషిలోని భక్తియావత్తు యిక్కడ ఉంది: "నీవు నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణవివేకముతోను, నీ పూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలె ననునది ప్రధానమైన ఆజ్ఞ" (మార్కు 12:30). కూలివాడు తన చేతుల నుపయోగిస్తాడు. నిపుణుడు తన చేతులను తలను ఉపయోగిస్తాడు. చిత్రకారుడు తన చేతులను, తలను, తన హృదయాన్ని వినియోగిస్తాడు. క్రైస్తవుడైతే – తన చేతులును తలను, హృదయాన్ని, తన ప్రాణాన్ని సహా తన దేవుని కొరకు ఉపయోగిస్తాడు. ఒకడు

సంపూర్ణంగా దేవునికి సమర్పించుకున్నవాని రూపచిత్రాన్ని మార్కు 12:30 గీచింది.

బాప్తిస్మపు సమయంలో, వ్యక్తుల మధ్య గొప్ప వ్యత్యాసముంటుంది. ప్రభువు యిచ్చిన ఆజ్ఞలకు లోబడతాడు, కాని మనం చదివిన దానిలో వర్ణింపబడిన ప్రేమయొక్క లోతు లేకుండనే, తన నెలసరి బిల్లులు చెల్లిస్తున్నట్టు అతడు ఆజ్ఞలకు లోబడతాడు. ఒక కాగితం మీద లిష్టు రాసికొనినట్టు: "నేను నమ్మాలి, తరువాత మారుమనస్సు పొందాలి, తరువాత ఒప్పుకోవాలి, ఆ తరువాత బాప్తిస్మం పొందాలి." నిత్యత్వాన్ని పోగొట్టుకొన కుండుటకు వాటిలో ప్రతిదాన్ని అతడు చెక్ చేసికొంటాడు.

యాంత్రికమైన ఆ విధేయతకును, మన లేఖనములో చెప్పబడిన లోతైన విధేయతకును గల వ్యత్యాసాన్ని ఆలోచించు: మరో వ్యక్తి తన్ను తాను క్రీస్తుకు సమర్పించుకొని అదే ఆహ్వానానికి లోబడ్డాడు. అతనికి ఉద్దేశం కలిగించింది దేవునికొరకైన ప్రేమ. అది అతని తన పాపముల విషయంలో మారు మనస్సు పొందేలా, తన విశ్వాసం మనుష్యుల యెదుట ఒప్పుకునేలా, బాప్తిస్మం పొందేలా అతని చేస్తుంది.[12] అది భారభరితమైన విధేయత కాదు, దేవుని ఎదుట తన్ను తానే ఖాళీచేసికొనే విధేయత. అతడు దేనిని ఆపుకోడు. తన్ను సృజించిన దేవునికి తానేమై యున్నాడో, తానేమి కాబోతున్నాడో ఆ సమస్తం ఆయనకు సమర్పించుకుంటాడు. ఇది ప్రభువు కోరుతున్నది.

నీవు బాప్తిస్మము పొందగోరితే – పునరుద్ధరింపబడవలసిన దేవుని బిడ్డవైతే[13] – పూర్ణ ప్రేమతో గల హృదయం నుండి కలిగే విధేయతను కనుపరచమని ప్రార్థిస్తున్నాను.

## నోట్సు

"అన్నిటికంటే మహాగొప్ప ఆజ్ఞ," "నిజమైన క్రైస్తవ్యపు కేంద్రబిందువు" అనే పేర్లు ఈ ప్రసంగానికి పెట్టవచ్చు.

---

సూచనలు

[1]Batsell Barrett Baxter, "The Greatest Commandment of All," *If I Be Lifted Up* (Nashville: Gospel Advocate Co., 1956), 9-18. [2]మత్తయి 6:3 ప్రయోగం నుండి ఈ పోలిక తీయబడింది. [3]"పూర్ణ" అనే పదం నొక్కి చెప్పబడింది. [4]Isaac Watts, "When I Survey the Wondrous Cross," *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [5]మనసును గూర్చిన ఉదాహరణను ఉపయోగించు. [6]ఈ ఉల్లేఖనమును J. Edgar Hoover వారిదని అంటారు. [7]David Lipscomb, *The Gospel Advocate.* సంపాదకులలో ఒకడు. ప్రభువు సంఘ సభ్యుడు, David Lipscomb University in Nashville, Tennessee, తన పేరుతో పిలువబడుతుంది. [8]Baxter, 15. [9]ఇక్కడ "P" ఉచ్చరించబడదు.

[10]"Psyche" కేవలం వ్యక్తిని సూచిస్తుంది ("ఆత్మలు"; అపొ. 2:41). [11]Quoted in Avon Malone, "The Characteristics of a Good Steward," *The Preacher's Periodical* (July 1983): 11. [12]ఒకానొక సందర్భంలో విశ్వాసం, మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మమను వాటిని చెప్పాలి (మార్కు 16:16; అపొ. 2:39; రోమా 10:9, 10). [13]ప్రభువు దగ్గరికి తిరిగి రావడం ఎలా అనే విషయానికి సంబంధించిన లేఖనాలను తెలుపవచ్చు (అపొ. 8:22; యాకోబు 5:16).